సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం, 5, డిసెంబర్, 2023



రాజన్నకు మొక్కులు

వేములవాడ: కార్తీక సోమవారం సందర్భంగా రాజన్నను 30 వేల మంది దర్శించుకున్నారు. రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



గోశాలకు కోడెలు

వేములవాడఅర్బన్:తిప్పాపూర్ రాజన్న గోశాలలోని 30 కోడెలను సోమవారం వేములవాడ పట్టణం ముదిరాజ్ వీధికి అందజేసినట్లు అధికారులు తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
28.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. ఉదయం, సాయంత్రం చలిగాలులు వీచే అవకాశం ఉంది.

కంచుకోటకు బీటలు

- ఉమ్మడి జిల్లాలో 'కారు'కు ఊహించని ఫలితాలు
- ఏ పథకం మొదలు పెట్టినా ఇక్కడ నుంచే..
- పథకాల అమలులోనూ పక్షపాతం
- పార్టీ నేతల అవినీతి, వెన్నుపోటు రాజకీయాలు ఓటమికి కారణమని అనుమానం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉత్తర తెలంగాణకు కేంద్ర బిందువైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి శాసనసభ ఫలితాల్లో ఊహించని దెబ్బ తగిలింది. తెలంగాణ ఏర్పడ్డాక మొదటిసారిగా శాసనసభకు జరిగిన ఎన్నికల్లో 2014లో జగిత్యాల నుంచి కాంగ్రెస్ శాసనసభ్యుడిగా తాటిపర్తి జీవన్ రెడ్డి ఎన్నికయ్యారు. మిగతా 12 సీట్లను బీఆర్ఎస్ పార్టీ గెలుచుకుని సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. 2018లో జరిగిన ఎన్నికల్లో మంథని నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఒక్కరే ఎన్నికయ్యారు. మిగితా 12 చోట్ల బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలే గెలువడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా గులాబీ పార్టీకి గుండెకాయలా నిలిచింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏకంగా ఎనిమిది సీట్లను గెలుచుకుని గులాబీ కంచుకోటకు బీటలు పారించడడంతో గులాబీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఐదు సీట్లకే పరిమితం

బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడం గమనార్హం. రెండు దఫాలుగా జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఒక్క సీటుకు పరిమితం చేయడమే కాకుండా పది సంవత్సరాలుగా జిల్లా పరిషత్, మండల పరిషత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఎన్నికల్లో ఏకపక్షంగా గెలుస్తూ ప్రతిపక్షాలను చిత్తు చేయడంతో ఆ పార్టీల ఊసే లేకుండాపోయింది. సర్పంచ్ మొదలు ఎమ్మెల్యే, మంత్రుల వరకూ గులాబీ దళపతులే కావడంతో పరిపాలన వ్యవస్థ గాడి తప్పింది. బీఆర్ఎస్ పార్టీ నేతలు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే క్రమంలో.. లబ్ధిదారుల ఎంపికలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అర్హులకు కాకుండా అనర్హులను ఎంపిక చేయడంతో గ్రామాల్లో అలజడులకు బీజం పోసినట్లయింది. పార్టీ నాయకుల ఒంటెత్తుపోకడలు, వారిని అదుపులో పెట్టాల్సిన ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు ఉండటంతో క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పార్టీ అంటేనే గ్రామాల్లో ఒకింత అసహనానికి గురి చేసింది. ఇలా పెత్తనం చెలాయించే వ్యక్తుల సంఖ్య క్రమేపీ పెరిగింది. డబుల్‌బెడ్‌రూం, రైతుబంధు, రైతుబీమా, దళిత బంధు, బీసీ చేయూత, గృహలక్ష్మి వంటి పథకాలు ప్రవేశపెట్టిన క్రమంలో చెప్పిన మాటలకు క్షేత్రస్థాయిలో జరిగిన ఆచరణకు పొంతన లేకపోవడంతో పల్లెల్లో ప్రజలు, నాయకులకు మధ్య విభజన రేఖ మొదలైంది. పథకాల అమలు విషయంలో పార్టీ వ్యక్తులు, అనుకూలమైన వారికే కట్టబెట్టడం వంటి సంఘటనలను ప్రజలు మరిచిపోలేకపోయారు. లబ్ధిదారుల అర్హుల జాబితా తయారు చేసే సమయంలో గ్రామాల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం, పదుల సంఖ్యలో పథకాలు అమలుకావడంతో ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీపై, నాయకుల తీరుపై చర్చలు తీవ్రస్థాయిలో ఆలోచింపజేసే విధంగా జరిగి అసంతృప్తికి దారి తీశాయి.

మొదలైన పోస్టుమార్టం

గులాబీ జెండాకు అండగా నిలుస్తూ వచ్చిన ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఎనిమిది సీట్లను కట్టబెట్టడం.. బీఆర్ఎస్‌కు కేవలం ఐదు సీట్లకు పరిమితం చేయడంపై పార్టీలో పోస్టుమార్టం మొదలైంది. పెద్దపల్లి జిల్లా మొత్తంలో ఒక్కసీటు కూడా రాకపోవడంపై బీఆర్ఎస్ అగ్రనేతలు ఆరా తీస్తున్నారు. సింగరేణి కార్మికులు ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ వైపే ఉన్నా.. మంథని, రామగుండం, పెద్దపల్లిలో విజయం సిద్ధించకపోవడంపై పోస్టుమార్టం మొదలైంది. చొప్పదండిలో పోలీసు పోస్టింగుల వివాదం, స్థానిక నేతల మధ్య సయోధ్య కుదరకపోవడం ద్వారా అక్కడ పార్టీ పరాజయం పాలైందని సమాచారం. మానకొండూరులో దళితబంధులో అక్రమాలు జరిగాయని, అభివృద్ధి పనులు సరిగా జరగలేదన్న అభిప్రాయం ఓటమికి కారణమై ఉండవచ్చని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు. వేములవాడలో బీఆర్ఎస్ హోరాహోరీగా పోరాడినా.. కాంగ్రెస్ అభ్యర్థిపై సానుభూతి ముందు నిలవలేకపోయింది. ధర్మపురిలోనూ సానుభూతి పవనాలు కాంగ్రెస్ విజయానికి బాటలు వేశాయి. కరీంనగర్‌లో వెన్నుపోటు రాజకీయాలు విజయాన్ని ప్రభావితం చేశాయి. కొందరు కీలక నేతలు ఆఖరు నిమిషంలో పార్టీ మారడం, బీఆర్ఎస్‌లో ఉండి ఇతర పార్టీల కోసం పనిచేయడం విజయావకాశాలపై తీవ్ర ప్రభావం చూపింది.

ఉమ్మడి జిల్లాకు పెద్దపీట

బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి జిల్లాలో ఈటల రాజేందర్, కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్‌కు మంత్రి పదవులు కట్టబెట్టడమే కాకుండా పదుల సంఖ్యలో రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులను జిల్లాకు చెందిన వారికే అవకాశం ఇచ్చారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టిసారించకుండా, జిల్లా, మండల, గ్రామ కమిటీలు లేకుండా, పార్టీ అనుబంధ విభాగాలపై దృష్టిసారించకుండా చోటామోటా నాయకులంతా ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరించడంతో పార్టీపై అజమాయిషీ లేకుండా పోయింది. దీంతో క్షేత్రస్థాయి నాయకుల ప్రవర్తనకు, వారు చేస్తున్న అవినీతికి విసిగివేసారిన ప్రజలు ప్రత్యామ్నాయం కోసం చూస్తున్న తరుణంలో శాసనసభ ఎన్నికలు వచ్చాయి. ప్రత్యామ్నాయ రూపంలో కాంగ్రెస్ పార్టీ కనబడడంతో ఆ పార్టీ వైపే అన్ని వర్గాల ప్రజలు మొగ్గు చూపారు. ఇది బీఆర్ఎస్ పార్టీ కోటకు బీటలు పడినట్లయింది. ధరణితో ఒకరి భూములు ఒకరికి మారాయని కార్యాలయాల చుట్టూ తిరిగినా రెవెన్యూ అధికారులు సమస్యలు పరిష్కరించకపోవడం, మార్గం చూపించకపోవడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేసింది. రెవెన్యూ, కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట బాహాటంగానే నిరసనలకు దిగిన సంఘటనలు కోకొల్లలుగా జరిగాయి.

కొంపముంచిన అవినీతి, వెన్నుపోటు రాజకీయాలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ పార్టీ నాయకుల కనుసన్నల్లో జరుగడం, క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు ద్వితీయ శ్రేణి నాయకులు చేతివాటం ప్రదర్శించడంతో గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల అవినీతికి అడ్డూఅదుపు లేకుండాపోయింది. పార్టీని సమన్వయం చేసి ప్రభుత్వ పథకాలను ప్రజలదరికి చేర్చాల్సిన ప్రజాప్రతినిధులు.. గ్రామాల్లో రెండుగా విడిపోయి వర్గాలుగా తయారుకావడం, వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడటం లాంటి విషయాలు పార్టీని కోలుకోని దెబ్బతీశాయని చెప్పవచ్చు. ఏదేమైనా 2001లో ఎస్సారార్ కళాశాల మైదానం వేదికగా జరిగిన సింహగర్జన బహిరంగ సభ నుంచి, తెలంగాణ ఉద్యమంలో ప్రతి సందర్భాన్ని కరీంనగర్ నుంచే ఉద్యమాన్ని రగిలించడం, చివరకు 2009లో తెలంగాణ కోసం కేసీఆర్ ఆమరణ దీక్షకు పూనుకోవడం లాంటి సంఘటనలు ఉద్యమ తొలినాళ్లల్లో మరిచిపోలేని సంఘటనలు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకాలన్నింటికి ఉమ్మడి కరీంనగర్ జిల్లానే వేదిక కావడం మరిచిపోలేని విషయం.

అమాత్య అవకాశం ఎవరికో..?

- ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో తీవ్రపోటీ
- రేసులో పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి



దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



పొన్నం ప్రభాకర్



జీవన్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్‌లో మంత్రి పదవులు చర్చ మొదలైంది. సీఎం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కేబినెట్ ఏర్పాటు చేస్తారన్న వార్తల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు పోటీపడుతున్నారు. వీరిలో ముఖ్యంగా గతంలో మంత్రిగా పనిచేసిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌లను కేబినెట్‌లోకి తీసుకుంటారని ప్రచారం సాగుతోంది. 13 స్థానాలు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాలుగు కొత్త జిల్లాలుగా ఆవిర్భావించిన నేపథ్యంలో జిల్లాకు ఒక మంత్రి చొప్పున ప్రకటించే అవకాశాలు ఉన్నాయని పార్టీ నేతలు తెలిపారు. గతంలో కేటీఆర్(సిరిసిల్ల), కొప్పుల ఈశ్వర్(ధర్మపురి), గంగుల కమలాకర్(కరీంనగర్), ఈటల రాజేందర్ (హుజూరాబాద్) నలుగురు మంత్రులుగా కొనసాగారని గుర్తు చేస్తున్నారు.

పోటీలో కొత్తవారు సైతం...

సీనియర్ నాయకులతో పాటు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నాయకులు కూడా మంత్రి మండలిలో చోటు లేదా పార్టీ బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వీరిలో ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలు కీలక బాధ్యతలు చేపట్టాలని ఉత్సాహంగా ఉన్నారు. పాత జిల్లాలో ఐక్యమత్యంతో పోరాడి 13 అసెంబ్లీ స్థానాల్లో ఎనిమిదింటిని కైవసం చేసుకున్న హస్తం నేతలు ఎన్నికల అనంతరం కూడా తాము ఇదే వైఖరితో ఐక్యంగా రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతామని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్ సింగ్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కూడా కేబినెట్‌లో చోటు ఆశిస్తున్నారని తెలిసింది. అయితే విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు సీనియర్లకు మంత్రి పదవులు, తొలిసారిగా గెలిచిన వారికి సామర్థ్యాన్ని బట్టి సహాయ మంత్రి లేదా పార్టీలో కీలక బాధ్యతలు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో జగిత్యాల అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈయన కూడా గతంలో అనేక మంత్రిత్వ శాఖలు నిర్వహించారు. ఇప్పటికి శాసన మండలి సభ్యుడిగా కొనసాగుతుండడంతో ఆయనను మంత్రి మండలిలోకి లేదా స్పీకర్ పదవికి ఎంపిక చేయవచ్చునని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

ఎవరూ నచ్చలేదు..!

- జిల్లాలో 2,122 మంది నోటా నొక్కేశారు



సిరిసిల్ల: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటూ కీలకమే. ఓటేసేందుకు పోలింగ్ కేంద్రం వరకు వచ్చి.. బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరూ నచ్చలేదని నిరసనను తెలియజేస్తూ 'నోటా'కు ఓటు వేయడం విశేషం. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 2,122 మంది ఓటర్లు 'నోటా'ను నొక్కి నేతలు ఎవరూ నచ్చలేదని సూటిగా స్పష్టం చేశారు.

తొలి ప్రయోగంలోనే సక్సెస్..

మన దేశంలో 'నోటా'ను తొలిసారిగా 2014 సార్వత్రిక ఎన్నికల్లో ప్రవేశపెట్టారు. బరిలో నిలిచిన పైవారు ఎవరూ కాదు.. నన్ ఆఫ్ ది ఎబోవ్ (నోటా) చెప్పేందుకు 'నోటా' అవకాశాన్ని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంలో చేర్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓట్ల శాతాన్ని పెంచేందుకు నోటా ఉపయోగపడుతుందనే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేశారు. 2014 ఎన్నికల్లో నోటా ప్రభావం స్పష్టంగా కనిపించింది. అభ్యర్థులు ఎవరూ నచ్చలేదంటూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 17,781 మంది ఓటర్లు నోటాకు ఓటు వేశారు. తొలిసారి ప్రయోగంలోనే నోటా ఎక్కువ మంది ఓటర్లను ఆకర్షించింది. 2014తో పోల్చితే 2018 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 4,317 మంది నోటాను నొక్కేశారు. నిజానికి తొలిసారి ప్రయోగంలో దానిపై పెద్దగా అవగాహన లేకపోయినా నోటాకే ఓటేశారు. కానీ ఈ సారి విద్యావంతులు, మేధావులు నోటాను ఎక్కువగా వినియోగించినట్లు భావిస్తున్నారు. కొందరు నిర్లక్ష్యరాస్యులు, గుర్తులు కనిపించని వారు, బ్యాలెట్‌లో చివరన ఉండే 'నోటా'ను నొక్కినట్లు సమాచారం. నోటా గురించి తెలియకపోయినా.. దానిపై పెద్దగా అవగాహన లేకున్నా 'నోటా'కు కొందరు ఓటు వేసి ఉంటారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లోనూ సిరిసిల్లలో ఇద్దరు, వేములవాడలో ఐదుగురు నోటాకు ఓటు వేయడం విశేషం.

జిల్లాలో నోటాకు ఓట్లు ఇలా..

నియోజకవర్గం	2014	2018	2023
సిరిసిల్ల	1,648	2,319	842
వేములవాడ	1,533	1,726	1,280

వదిలిన చిలుమెంత..

- ఎన్నికల ఫలితాలపై పోస్టుమార్టం
- పోయిన నోట్లు ఎన్ని.. వచ్చిన ఓట్లు ఎన్ని..?
- లెక్కలేస్తున్న అభ్యర్థులు
- గ్రామాల వారి నివేదికలతో ఆరా
- ఎన్నికల ఫలితాలపై ఆసక్తికర చర్చలు

సిరిసిల్ల: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఫలితాలపై పోస్టుమార్టం ప్రారంభించారు. ఎన్నికలకు మూడు నెలల ముందే అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించగా.. మరికొన్ని పార్టీలు నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ప్రకటించాయి. ఎన్నికల హడావుడి మొదలైన నాటి నుంచి ఈవీఎంలను తెరిచే నాటికి అయిన ఖర్చులను లెక్కలేస్తున్నారు. వచ్చిన ఓట్లను లెక్కలేస్తూ ఎక్కడ పొరపాటు జరిగింది అని ఆరా తీస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసేందుకు ఎన్నికలకు ముందు రోజు పంపిణీ చేసిన సొమ్ము అసలు ఓటర్లకు చేరిందా..? మధ్యవర్తులే మాయం చేశారా..? ఆరా తీస్తున్నారు. ఎన్నికల్లో వదిలిన సొమ్మును, వచ్చిన దమ్మును అంచనా వేయడంలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు.

రూ.కోట్లు పెట్టినా.. ఓట్లు రాలేదేమీ..

జిల్లాలోని వేములవాడ నియోజకవర్గంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆఖరి అంకంలో చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. ఈ నియోజకవర్గంలో రెండు కార్పొరేట్ సంస్థలకు చెందిన వ్యక్తులు రంగంలోకి దిగి గెలుపే లక్ష్యంగా పని చేశారు. చివరి క్షణంలో టిక్కెట్ దక్కించుకున్న అభ్యర్థి అన్ని గ్రామాల్లోని మహిళా సంఘాలకు రూ.25వేల చొప్పున ఏకకాలంలో పంపిణీ చేసినట్లు సమాచారం. దీంతో మరో అభ్యర్థి రంగంలోకి దిగి ఓటర్లందరికీ రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేశారు. డబ్బులు ఖర్చు చేసిన స్థాయిలో ఓట్లు రాలేదని ఫలితాల వెల్లడి తర్వాత స్పష్టమవుతుంది. నియోజకవర్గంలోని ఓ గ్రామంలో రూ.28 లక్షలు వెచ్చిస్తే.. కేవలం 640 ఓట్లు మాత్రమే రావడం విస్మయానికి గురి చేసింది. ఒక్కో ఓటు ఖరీదు రూ.4,375 చేరింది. ఎన్నికలకు ముందు రోజు చివరికి మరో అభ్యర్థి కేవలం మహిళా సంఘాల్లోని సభ్యులకు రూ.500 చొప్పున ఆఖరి ప్రయత్నంగా పంపిణీ చేసినట్లు సమాచారం. మొత్తంగా ముగ్గురు అభ్యర్థుల డబ్బులు తీసుకున్న ఓటర్లు సానుభూతికి పట్టం కడుతూ ఓట్లు కట్టబెట్టడంతో ఫలితం తారుమారైంది. సిరిసిల్ల నియోజకవర్గంలోని ఓ స్వతంత్ర అభ్యర్థి ఎన్నికల్లో రూ.5 కోట్ల వరకు వెచ్చించినా పెద్దగా ఓట్లు రాలేదు. మరో పార్టీ అభ్యర్థి రూ.2 కోట్లు వెచ్చించినా మూడంకెల ఓట్లు దాటకపోవడం ఆందోళనకు గురి చేసింది. ఇలా ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు వెచ్చించిన డబ్బులను లెక్కేస్తూ వచ్చిన ఓట్ల సంఖ్యను బేరీజు వేస్తున్నారు. గ్రామాల వారీగా, పోలింగ్ స్టేషన్ వారీగా పంచిన నోట్లను, వచ్చిన ఓట్లను లెక్కలేస్తున్నారు.

ప్రభావం చూపని స్వతంత్రులు

ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు మినహా స్వతంత్రులుగా పోటీ చేసిన వారు ఓటర్లపై ప్రభావం చూపలేకపోయారు. సిరిసిల్లలో సామాజిక నినాదంతో బరిలో దిగిన ఇద్దరు అభ్యర్థులు పెద్దగా ఓట్లు సాధించకపోవడం పద్మశాలీ సామాజిక వర్గంలో చర్చనీయాంశమైంది. మరోవైపు ప్రధాన పార్టీల అభ్యర్థులు సాధించిన ఓట్లపై సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో చర్చ సాగుతుంది.

వచ్చిన బలమెంత



పోలింగ్ కౌంటింగ్ కేంద్రం(ఫైల్)

వేములవాడలో అభ్యర్థులు సాధించిన ఓట్లు

ఆది శ్రీనివాస్ (కాంగ్రెస్)	71,451
డాక్టర్ గోలి మోహన్ (బీఎస్పీ)	4,649
చల్మెడ లక్ష్మీనర్సింహారావు	56,870
చెన్నమనేని వికాస్	29,710
ఎండీ అఖిల్‌పాష	2,836
గడ్డం హరీశ్	375
గుగ్గిళ్ల రవిగౌడ్	247
జక్కని భూపతి	139
రమేశ్‌బాబు అజ్మీరా	232
రవి నాయిని	611
అంగూరి రంజిత్	429
కట్కూరి అనోస్	503
గుడిసె మోహన్	1,266
జింక శ్రీనివాస్	1,928
పుప్పాల మోహన్	419
మెరుపుల రాకేశ్‌రెడ్డి	1,200
నోటా	1,280

సిరిసిల్ల నియోజకవర్గంలో అభ్యర్థులు సాధించిన ఓట్లు

కె.తారక రామారావు (బీఆర్ఎస్)	89,244
పిట్టల భూమేశ్ (బీఎస్పీ)	7,585
కె.కె.మహేందర్‌రెడ్డి (కాంగ్రెస్)	59,557
రాణిరుద్రమరెడ్డి (బీజేపీ)	18,328
కేసుగాని పరమేశ్వరి	333
కొండ రవికాంత్	1,526
దోసల చంద్రం	121
డి.దేవయ్య	136
పత్తిపాక సురేశ్	1,166
రాగుల రాములు	408
లగిశెట్టి శ్రీనివాస్	2,568
ఎ.సాయికుమార్	342
కృష్ణ దొనికెని	750
కొండూరి బాలలింగం	766
గౌటే గణేశ్	1,752
జి.మధు	1,983
తాటిపాముల శ్రీనివాస్	183
నక్క హరీశ్	440
బుసాపురం ప్రవీణ్	157
రిక్కమల్ల మనోజ్‌కుమార్	178
నోటా	842

న్యూస్‌రీల్

రేవంత్‌ను కలిసిన ఆది



రేవంత్‌రెడ్డితో ఆది శ్రీనివాస్

వేములవాడ: వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపొందిన విషయం తెలిసిందే. ఈమేరకు సోమవారం ఆది హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.

గన్‌మెన్ల తొలగింపు

సిరిసిల్ల: జిల్లాలోని ఇద్దరు నేతల గన్‌మెన్లను తొలగించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన తోట ఆగయ్యకు టూ ప్లస్ టూ గన్‌మెన్లతో రక్షణ కల్పించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పరాజయం పొందడంతో ఆదివారం సాయంత్రమే ఆయనకు కేటాయించిన గన్‌మెన్లను జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు తొలగించారు. ఫలితాలు వెలువడగానే గన్‌మెన్లను వెనక్కి రావాల్సిందిగా ఆదేశాలిచ్చారు. సిరిసిల్లకు చెందిన టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌కు వన్ ప్లస్ వన్ గన్‌మెన్లతో రక్షణ కల్పించగా.. ఆయన సోమవారం రాజీనామా చేయడంతో ఆయనకు నియమించిన గన్‌మెన్లను ఉపసంహరించారు. ఇద్దరు అధికార పార్టీ నేతల గన్‌మెన్లను తొలగించడం జిల్లాలో చర్చనీయాంశమైంది. జిల్లాలో అసాంఘిక శక్తుల కదలికలు పెద్దగా లేవు. ఇలాంటి తరుణంలో జిల్లాలో మరి కొందరు నేతలకు ఇంకా గన్‌మెన్లు ఉన్నారు. కొందరికి వెపన్ లైసెన్స్‌లు ఉన్నాయి. అధికార పార్టీలో ఉండడంతో ఆ దర్పం కోసం కొందరు లైసెన్స్‌లు తీసుకున్నారు. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ అధికారానికి దూరం కావడంతో ఆ నేతల గన్‌లైసెన్స్‌లు ఉంటాయా..? తొలగిస్తారా..? అనే అనుమానాలు ఉన్నాయి. నక్సలైట్ల కదలికలు ఉన్న రోజుల్లో చాలా మందికి వెపన్ లైసెన్స్‌లు ఉండేవి. నక్సలైట్ల ఉనికి తగ్గడంతో పోలీస్‌శాఖ వెపన్ లైసెన్స్‌ల రద్దు సిఫార్సు చేసింది. దీంతో చాలా మంది తమ లైసెన్స్ ఆయుధాలను వాపస్ ఇచ్చారు. ఇద్దరు నేతల గన్‌మెన్లను ఉపసంహరించిన నేపథ్యంలో వెపన్ లైసెన్స్‌లపై చర్చసాగుతుంది.

ఆది గెలుపు.. ఆర్యవైశ్యుల మొక్కు



రాజన్న గుడి మెట్లపై కొబ్బరికాయలు కొడుతున్న ఆర్యవైశ్యులు

వేములవాడ: వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపొందడంతో సోమవారం స్థానిక ఆర్యవైశ్యులు రాజన్నకు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్త అనిల్‌కుమార్, పట్టణ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘాల అధ్యక్షులు, కోశాధికారులు, సెక్రెటరీలు, రాచకొండ ప్రసాద్, దైత సతీశ్, చేపూరి గణేశ్, నూకల శ్రీనివాస్, రాజేందర్, బొూశెట్టి శ్రీనివాస్, సత్యనారాయణ, సిద్దంశెట్టి వేణు, కొమురవెల్లి సంతోష్, చేపూరి సురేశ్, వంగల కిరణ్, అల్లాడి మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఓడినా ప్రజల పక్షాన పోరాడుతా..



మాట్లాడుతున్న వికాస్‌రావు

వేములవాడఅర్బన్: తాము చేసే సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. సోమవారం వేములవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తనకు ఓటు వేసిన వేములవాడ నియోజకవర్గ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆది శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రాంత బీజేపీ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండి వారి బాగోగులు చూసుకుంటామని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజల పక్షాన పోరాడుతామని, రాబోయే రోజుల్లో బీజేపీని మరింత బలోపేతం చేస్తామని వివరించారు. ఎన్నికల సమయంలో తన వెన్నంటి నడిచిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఎన్నికల ధ్రువీకరణ పత్రం

- హైదరాబాద్‌లో అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



కేటీఆర్‌కు ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల: సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఎన్నికైన కె.తారక రామారావుకు ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని సోమవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులు అందించారు. శాసన సభ ఎన్నికల్లో కేటీఆర్ 29,687 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బద్దెనపల్లిలోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి ఆదివారం ఓట్ల లెక్కింపు సందర్భంగా కేటీఆర్ రాలేదు. ఆయన తరఫున ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.ఆనంద్‌కుమార్ నుంచి బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. సిరిసిల్ల శాసన సభ్యుడిగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి అందించిన పత్రాన్ని కేటీఆర్‌కు బీఆర్ఎస్ నాయకులు అందించారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, నాయకులు గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి, తోట ఆగయ్య, బొల్లి రామ్మోహన్, వలస కృష్ణహరి, కొండ రమేశ్ ఉన్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఎన్నికైన కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

'గూడూరి' రాజీనామా



ప్రవీణ్

సిరిసిల్ల: తెలంగాణ రాష్ట్ర పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి రాజీనామా లేఖను పంపించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినందున తాను పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించారు. 2022 సెప్టెంబరు 13న టీపీటీడీసీ చైర్మన్‌గా నియమితులయ్యారు. 15 నెలల పాటు ప్రవీణ్ ఆ పదవిలో కొనసాగారు.

క్లుప్తంగా

సొంతగూటికి చొక్కాల

- షర్మిల సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరిక



షర్మిల సమక్షంలో పార్టీలో చేరిన రాము

సిరిసిల్లటౌన్: ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన చొక్కాల రాము మళ్లీ సొంతగూటికి చేరుకున్నారు. గతంలో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఆయన అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి ఐటీ శాఖ మంత్రి తారకరామారావు సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో ప్రాధాన్యం లోపించడంతో అనుచరులతో కలిసి సోమవారం లోటస్‌పాండ్‌లో వైఎస్సార్ టీపీ అధినేత్రి వై.ఎస్.షర్మిల సమక్షంలో పార్టీలో చేరగా.. ఆమె కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాము పేర్కొన్నారు. జిల్లాలో ముదిరాజ్ సంఘం, రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యమంలో కీలక నేతగా ఉన్న రాము.. మళ్లీ సొంతగూటికి చేరడం విశేషం.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి(వేములవాడ): రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని సోమవారం రాత్రి ఢీకొట్టి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన ముదాం చిన్న తిరుపతి అనే యువకుడు వేములవాడ పట్టణం నుంచి స్వగ్రామమైన మల్యాల గ్రామానికి వెళ్తుండగా.. మల్యాల గ్రామ శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తలకు ఉన్న హెల్మెట్ పగిలి తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో తిరుపతిని అంబులెన్స్‌లో వేములవాడకు తరలించారు. వైద్యులు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పినట్లు తెలిపారు. చందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సారంగాపూర్: వరి కోత యంత్రం ఢీకొనడంతో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. ఒడ్డెరకాలనీకి చెందిన అల్లెపు పెద్ద ఎల్లయ్య(52), అతడి భార్య నర్సవ్వ ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై ఈనెల 1న రంగపేట గ్రామం నుంచి బట్టపల్లి గ్రామం వైపు వెళ్తున్న క్రమంలో రేచపల్లి గ్రామ శివారులో మహేశ్ అనే వ్యక్తి వరి కోత యంత్రం అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ వారిని ఢీకొట్టాడు. దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడగా.. వారిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఎల్లయ్య మృతిచెందాడు. మృతుడి కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఊపిరి పీల్చుకున్న ఖాకీలు

- ముగిసిన ఎన్నికల హడావుడి
- స్వస్థలాలకు సాయుధ బలగాలు
- సాధారణ విధుల్లో పోలీసు అధికారులు



జిల్లాలో విధులు నిర్వహించిన సాయుధ బలగాలు(ఫైల్)

సిరిసిల్లక్రైం: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు కంటి మీద కునుకు లేకుండా విధులు నిర్వహించారు. ఫలితాలు వెల్లడి కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు హేమాహేమీలుండడం.. ప్రచారం జోరుగా ఉండడంతో.. పోలీసు అధికారులు ప్రతీరోజు ఏదో ఓ ఏరియాలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. భద్రత మాది.. ఓటేసే బాధ్యత మీదంటూ జిల్లాలో ప్రజలను సంసిద్ధులను చేశారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రణాళికతో పోలీసు శాఖ ముందుకెళ్లింది. అన్ని శాఖల సమన్వయంతో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరగడంలో సఫలీకృతులయ్యారు. జిల్లాలో దాదాపు 1,700 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించినట్లు గణాంకాలున్నాయి. వీరందరూ సోమవారం వారి స్వస్థలాలకు వెళ్లారు.

ఉద్దండులున్న జిల్లాలో..

తెలంగాణ ఆవిర్భావం నుంచి అధికారంలో ఉన్న నేతతో తలపడేందుకు పలుమార్లు ఓటమి చవిచూసిన సీనియర్ నాయకుడు సిరిసిల్లలో బరిలో ఉండడం.. నాలుగుసార్లు ఓటమిపాలైనా గెలుపే ధ్యేయంగా ముందుకుసాగాలన్న సంకల్పంతో ఆది శ్రీనివాస్.. బీఆర్‌ఎస్ పక్షాన ఆర్థిక బలమున్న నాయకుడిగా చల్మెడ లక్ష్మీనర్సింహారావు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ కుమారుడు చెన్నమనేని వికాస్ ఉండడంతో జిల్లాలో ఎన్నికలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వీళ్లకు తోడు బీజేపీ నుంచి రాణిరుద్రమ, స్థానిక పద్మశాలి వర్గం నుంచి లగిశెట్టి శ్రీనివాస్ బరిలో ఉండడంతో.. ఎన్నికల్లో గెలవడానికి పార్టీల పెద్దలు వస్తారని ముందుగా ఊహించారు. బందోబస్తుకు ముందస్తు ప్రణాళికలు చేశారు. ముఖ్యమంత్రులు, పార్టీ అధినేతలు, ముఖ్య నేతలు ఇలా ప్రచారం జోరుగా సాగింది. కానీ ఎక్కడ గొడవలు, అల్లర్లు జరగకుండా పోలీసు భద్రత భేష్‌గా పని చేసినట్లు అభిప్రాయాలున్నాయి.

ఆరు కంపెనీలతో..

జిల్లాలో ఉన్న పోలీసు ఫోర్స్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ఆరు కంపెనీలకు చెందిన పోలీసులు ఎన్నికల వేళ విధులు నిర్వహించినట్లు పోలీసు శాఖ అధికారిక గణాంకాలున్నాయి. అక్టోబర్ 24న వచ్చిన బీఎస్‌ఎఫ్‌కు చెందిన నాలుగు కంపెనీల నుంచి సుమారు 200 మంది విధులు నిర్వహించారు. నవంబర్ 25న మరో 4కంపెనీలకు చెందిన మహారాష్ట్ర హోంగార్డులు, బీఎస్‌ఎఫ్ సిరిసిల్ల బెటాలియన్, రైల్వే ఫోర్స్ పోలింగ్ ముందు జిల్లాలో భద్రత చర్యల్లో ఉన్నారు. వీరందరినీ జిల్లా సివిల్, ఏఆర్ విభాగం పోలీసులు సమన్వయం చేశారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారి ఎస్పీ అఖిల్ మహాజన్ ఎప్పటికప్పుడు సూచనలు చేసి ప్రచారం, పోలింగ్, లెక్కింపు ప్రక్రియ శాంతియుతంగా జరగడంలో విజయవంతమయ్యారు. ఎన్నికలు ముగియడంతో కొందరు ఈనెల 3న వెళ్లగా.. మరికొన్ని బలగాలు సోమవారం వారి స్వస్థలాలకు వెళ్లినట్లు పోలీస్ శాఖ అధికారులు వెల్లడించారు.

వేములవాడలో 19 రౌండ్లలో లెక్కింపు



ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్న అధికారులు

వేములవాడ: వేములవాడ అసెంబ్లీ స్థానానికి గత నెల 30న ఎన్నికలు జరగగా.. ఎన్నికల అధికారులు, సిబ్బంది ఆదివారం 19 రౌండ్లలో ఫలితాలను లెక్కించారు. 4రౌండ్లు మినహా మిగతా రౌండ్లలో ఆది శ్రీనివాస్‌కు ఆధిక్యం లభించింది. మొత్తంగా 260 బూత్‌లుండగా.. 19 రౌండ్లలో లెక్కించారు. రౌండ్లవారీగా ఓట్లు ఇలా వచ్చాయి.

మొత్తం ఓట్లు: 2,22,215
పోలైన ఓట్లు: 1,74,145
ఆది శ్రీనివాస్, కాంగ్రెస్: 71,451
చల్మెడ లక్ష్మీనర్సింహారావు, బీఆర్‌ఎస్: 56,870
చెన్నమనేని వికాస్‌రావు, బీజేపీ: 29,710
మెజారిటీ: 14,581 నోటా: 1,280

రౌండ్	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ	లీడ్	పార్టీ
1	3,112	2,908	2,555	204	కాంగ్రెస్
2	3,033	2,743	2,115	290	కాంగ్రెస్
3	3,105	2,606	1,857	499	కాంగ్రెస్
4	3,805	2,361	2,199	1,444	కాంగ్రెస్
5	3,431	3,027	2,126	404	కాంగ్రెస్
6	3,260	3,325	1,961	65	బీఆర్‌ఎస్
7	4,960	3,113	1,324	1,847	కాంగ్రెస్
8	4,142	2,718	1,589	1,424	కాంగ్రెస్
9	4,232	3,362	931	870	కాంగ్రెస్
10	3,562	2,373	1,223	1,189	కాంగ్రెస్
11	4,127	3,188	1,201	939	కాంగ్రెస్
12	4,054	4,087	1,270	33	బీఆర్‌ఎస్
13	4,029	4,087	1,447	58	బీఆర్‌ఎస్
14	3,795	3,271	1,296	524	కాంగ్రెస్
15	4,775	2,879	1,132	1,896	కాంగ్రెస్
16	3,300	2,331	997	969	కాంగ్రెస్
17	4,259	2,876	1,519	1,383	కాంగ్రెస్
18	3,967	3,109	1,878	858	కాంగ్రెస్
19	1,888	2,174	913	286	బీఆర్‌ఎస్
పోస్టల్ బ్యాలెట్	615	332	177		
మొత్తం	71,451	56,870	29,710		





వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: కార్తీక సోమవారం సందర్భంగా రాత్రి రాజన్న సన్నిధిలోని మహామంటపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం రెండు గంటలపాటు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ



లక్ష్మీపూర్‌లో ధ్వంసమైన విద్యుత్ మోటారు, స్టార్టర్



ధ్వంసమైన డ్రిప్ ట్యాంకర్

జగిత్యాలరూరల్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడగా.. గెలుపొందిన అభ్యర్థుల కార్యకర్తలు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నా టపాసులు పేల్చడంతో పాటు డీజేలు పెట్టి హంగామా సృష్టించారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో.. ఓ పార్టీకి చెందిన కార్యకర్త పలువురు రైతులకు చెందిన విద్యుత్ మోటార్లు ధ్వంసం చేయడంతో పాటు స్టార్టర్లు పగలగొట్టాడు. రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హైదర్‌పల్లి, చల్‌గల్ గ్రామాల్లో ఆదివారం రాత్రి రెండువర్గాల వారు వాగ్వాదానికి దిగారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



వెల్గటూర్: ఎక్స్‌వేటర్ ఆపరేటర్ నిర్లక్ష్యంతో ఒకరు మృతిచెందారు. ఆదివారం మండల కేంద్రంలో కాళేశ్వరం లింక్-2 పనుల్లో భాగంగా సర్జిపుల్ డీటీ-5 వద్ద మెఘా కంపెనీకి చెందిన ఎక్స్‌వేటర్ పని చేస్తుండగా.. ఎక్స్‌వేటర్ ఆపరేటర్ వెనకకు తిప్పడంతో వాహనం వెనకాల క్లీనర్ పని చేస్తున్న సుభాష్‌ను ఢీకొంది. రెండు కాళ్లు విరిగి తీవ్ర రక్తస్రావం జరిగింది. క్షతగాత్రుడ్ని కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. సోమవారం పంచనామా నిర్వహించి అతడి భార్య సీమ కుమారికి అప్పగించారు. కంపెనీ అడ్మిన్ బొల్లం శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.



రాజన్న సాక్షిగా భక్తుల కష్టాలు

వేములవాడ: కార్తీక మాసం సందర్భంగా రాజన్న ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. సోమవారం వేలాదిగా తరలిరావడంతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. సరైన సౌకర్యాల్లేక అవస్థలు పడ్డారు. మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుధ్యం సక్రమంగా లేక భక్తులు ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించేందుకు అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పవిత్రంగా వెలిగించిన దీపాల వద్దకు జనం వస్తుండటంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని వరంగల్‌కు చెందిన లక్ష్మణ్, రాజేశ్వరి, ముకుందం సాక్షితో అన్నారు.

చీకట్లోనే మొక్కులు..

భక్తులు సోమవారం రాత్రి చీకట్లోనే బద్ది పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకోవాల్సి వచ్చింది. తాత్కాలికంగా వేసిన చలువ పందిళ్లు, క్యూలైన్లలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు అవస్థలు పడాల్సి వచ్చింది.



కాలువ పూర్తయ్యేదెన్నడో?

- అసంపూర్తి పనులతో మురికి కూపాలను తలపిస్తున్న కాలువ
- కాలువ నిండి కోసుకుపోతున్న పంట పొలాలు, రోడ్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పూర్తయితే యాసంగికి తప్పనున్న సాగునీటి తిప్పలు



అసంపూర్తి పనులతో వరదనీరు చేరి మురికి కూపాన్ని తలపిస్తున్న కాలువ

రుద్రంగి(వేములవాడ): సూరమ్మ చెరువును ఎల్లంపెల్లి నీటితో నింపేందుకు రుద్రంగి మండలంలో తీసిన ఎల్లంపెల్లి ఎత్తిపోతల పథకం కాలువ పనులు మధ్యలోనే వదిలేయడంతో రుద్రంగి గ్రామ ప్రజలు అసంపూర్తిగా మిగిలిపోయిన కాలువతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువ పూర్తి కాకపోవడంతో ప్రతి సంవత్సరం వర్షాకాలం కురుస్తున్న వర్షాలకు వరద నీరు కాలువలో నిండిపోయి ఎక్కువైన నీరు చుట్టుపక్కనున్న పంట పొలాలతో పాటు ఇళ్లలోకి చేరుతోందని, రోడ్లు కోసుకుపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని వారు వాపోతున్నారు. తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారని, ఇదంతా కాలువ పనులు పూర్తి కాకపోవడంతోనే జరుగుతుందని, త్వరగా కాలువ పనులు పూర్తి చేసి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు.

లోపిస్తున్న పారిశుధ్యం

కాలువ గ్రామంలోని కాలనీల గుండా వెళ్తోంది. కాలువలో వర్షపు నీరు నిలిచి నీరు వెళ్లే దారి లేక నెలల తరబడి కాలువలో నీరు నిలిచి మురికి కూపంలా తయారై దుర్వాసన వెదజల్లుతోందని, ఈగలు, దోమలు అధికమై రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.


ప్రమాదకరంగా కాలువ

పూర్తి కాని కాలువలో పెద్దఎత్తున నీరు నిలిచి మురికి బావులను తలపిస్తున్నాయని, కాలువ ఇళ్ల మధ్యలోనే ఉండడంతో చిన్న పిల్లలు ఆడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకముందే కాలువను పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

తప్పనున్న తిప్పలు

ఇప్పుడు పొలాలు సాగు దశలో ఉన్నాయి. ఎక్కువ నీరున్న బోరుబావుల రైతులే పొలాలు సాగు చేస్తున్నారు. బావులున్న రైతులు, తక్కువ నీరున్న బోరుబావుల రైతులు వేసవిలో పంట చేతికందే దశలో భూగర్భజలాలు అడుగంటిపోయి బావులు, బోరుబావులు ఎండిపోతాయనే భయంతో పంట పొలాలు సాగు చేయకుండా వందల ఎకరాల్లో పంట పొలాలను బీడు ఉంచుతున్నారు. కాలువ పూర్తి చేసి గోదావరి నీటిని కాలువల ద్వారా విడిస్తే పంట పొలాలకు యాసంగి సాగునీటి తిప్పలు తప్పుతుందని అన్నదాతలు అంటున్నారు. త్వరగా కాలువను పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.


భరించలేని దుర్వాసన



కాలువలో నిలిచిన నీరు వెళ్లిపోయే దారి లేక అందులో ఉన్న చెత్తాచెదారం కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు నీటిపై ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలబారిన పడుతున్నాం. కాలువ త్వరగా పూర్తి చేయాలి.

– గనికంటి గంగారెడ్డి, రామకిష్టాపూర్ కాలనీవాసుడు, రుద్రంగి

ఇళ్లలోకి నీరు



వర్షాకాలంలో భారీగా కురుస్తున్న వర్షాలకు కాలువ నిండిపోయి వరద ఎక్కువై నీరు ఇళ్లలోకి వస్తోంది. పంట పొలాలు, దారులు కోసుకుపోతున్నాయి. కాలువ పూర్తయితే నీరు కాలువ ద్వారా చెరువులకు వెళ్లి ఎలాంటి సమస్య ఉండదు. కాలువ ఇళ్ల మధ్యలోనే ఉండడంతో చిన్న పిల్లలు ఆడుకుంటూ వెళ్లి అందులో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంది. కాలువ తొందరగా పూర్తి చేయాలి.

– దుంపెట నర్సవ్వ, మహిళ, రుద్రంగి

ఎకరం పొలం వదిలేసిన



నాకు ఎకరం పొలం ఉంది. బావి నీటితోనే సాగు చేస్తా. వర్షాకాలం సాగు చేసుకుంటా. వేసవిలో పంట చివరి దశలో భూగర్భజలాలు అడుగంటి బావి ఎండిపోయి వరి పొలం ఎండిపోతుంది. అందుకని ప్రతి యాసంగిలో ఎకరం పొలం సాగు చేయకుండా అలాగే వదిలేస్తున్నా. కాలువలు పూర్తి చేసి గోదావరి నీటిని వదిలితే చివరి దశలో పంటలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. భూగర్భజలాలు కూడా పెరుగుతాయి.

– దేశవేని నర్సయ్య, రైతు, రుద్రంగి

కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చాం



కాలువ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చాం. త్వరలోనే కాలువ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– సంతు ప్రకాష్, ఈఈ, శ్రీపాద ఎల్లంపల్లి